నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 26 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మునీర్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మునీరన్న ఇకలేరు..

హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి తుదిశ్వాస

- మందమర్రిలో అంత్యక్రియలు పూర్తి
- నాలుగు దశాబ్దాలకు పైగా పాత్రికేయునిగా సేవలు
- సింగరేణి జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర
- నివాళులర్పించిన నాయకులు, పాత్రికేయులు, అభిమానులు

జర్నలిస్ట్ ఎండీ మునీర్ (ఫైల్)

మంచిర్యాల టౌన్, మే 25 : సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ ఇకలేరు. నాలుగు దశాబ్దాలకు పైగా పాత్రికేయునిగా పనిచేసిన ఆయన ఈ ప్రాంత ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓమెగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని మంచిర్యాలలోని తన నివాసానికి తీసుకువచ్చారు. సాయంత్రం ఐదుగంటలకు మందమర్రికి తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. 'బండకింది బతుకులు' అనే శీర్షికతో రెండున్నరేళ్ల పాటు సింగరేణి కార్మికుల వెతలపై రాసిన కథనాలు ఆయనకు మంచిపేరు తెచ్చిపెట్టాయి. జర్నలిస్టు మునీరన్నగా ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితుడైన ఆయన ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేశారు. అనంతరం పలు పత్రికల్లో వ్యాసాలు రాశారు. టీయూడబ్ల్యూజే-143 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, మంచిర్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పనిచేశారు. సింగరేణి కార్మికునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. సింగరేణి జేఏసీ చైర్మన్‌గా ఈ ప్రాంత కార్మికులను తెలంగాణ ఉద్యమంలో మమేకం చేసి ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన తనవంతు పాత్ర పోషించారు.

మునీర్ మరణ వార్త తెలుసుకున్న రాజకీయనాయకులు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, పాత్రికేయులు, అభిమానులు పెద్ద సంఖ్యలో మంచిర్యాలలోని ఆయన నివాసానికి తరలివచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, కార్మిక సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, రియాజ్ అహ్మద్, సీపీఐ, విప్లవ సంఘాల నాయకులు, పాత్రికేయులు మునీర్‌కు నివాళులర్పించారు. మందమర్రిలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ కోదండరామ్, టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, సీపీఐ నాయకులు కలవేణ శంకర్ పాల్గొన్నారు.

మునీర్ అంత్యక్రియల్లో ఎంపీ

మునీర్ అంత్యక్రియల్లో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పాల్గొని పాడే మోశారు. ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంతో మునీర్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన తాత కాక వెంకటస్వామితో మునీర్ అత్యంత సన్నిహిత సంబంధం ఉండేదని, పెదనాన్న గడ్డం వినోద్, తన తండ్రి గడ్డం వివేక్‌లతో కూడా ఆయన ఎంతో దగ్గరగా ఉండేవారని తెలిపారు. ఆయన మరణం తనని ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మునీర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

భీంకు ఘన నివాళి

కెరమెరి, మే 25 : జల్.. జంగల్.. జమీన్ కోసం పోరాడి వీరమరణం పొందిన కుమ్రం భీంకు జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర బృందం ఘనంగా నివాళులర్పించింది. ఆదివారం జోడేఘాట్‌లోని భీం విగ్రహం, సమాధి వద్ద ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ బద్దిపడక శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మర్రి మహిపాల్, రాష్ట్ర కో కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, ఈసీ మెంబర్ రామచంద్రారావు, జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నైతం భానుచందర్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మ్యూజియంను సందర్శించి ఆదివాసుల ఆచార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు.

కుమ్రం భీంకు నివాళులర్పిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర బృందం

ఈసెట్ ఫలితాల్లో బెల్లంపల్లి విద్యార్థుల సత్తా

- మైనింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన అక్షయ
- వర్షిత్‌కు మూడు, మారుతి సాయికి నాలుగో ర్యాంకు

బెల్లంపల్లి/నస్పూర్, మే 25 : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన టీజీ ఈసెట్ ఫలితాల్లో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో 1,3,4 ర్యాంకులు సాధించారు. మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో కుర్మ అక్షయ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, పిప్పాల వర్షిత్ మూడు, నడ్లకొండ మారుతి సాయి నాలుగో ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. అలాగే రోహిత్ ఏడు, అట్ల అంజన్న ఎనిమిది, ఎం.అనూష దారి 12, బొమ్మ అనిల్ 23 ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్లు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మంచిర్యాల విద్యార్థి సంతోష్ తెలంగాణ స్టేట్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏడో ర్యాంకు సాధించాడు. సంతోష్ హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేశాడు. సంతోష్‌ను కుటుంబీకులు, స్నేహితులు అభినందించారు.

బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

గేట్‌లోనూ ఫస్ట్ ర్యాంకు సాధిస్తా

మాది పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం. ఈసెట్ ఫలితాల్లో మైనింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించినందుకు ఆనందంగా ఉంది. ఈ విజయం వెనక నా తల్లిదండ్రులు లావణ్య, అనిల్ కుమార్‌ల ప్రోత్సాహం ఎంతగానో ఉంది. కళాశాలలోని మైనింగ్ లెక్చరర్లు అందించిన ఉత్తమ శిక్షణ వల్ల నేను మొదటి ర్యాంకు సాధించాను. జాతీయ స్థాయి గేట్‌లోనూ మొదటి ర్యాంకు సాధించడం నా లక్ష్యం. ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్యను కొనసాగిస్తా. అనంతరం సింగరేణి లేదా కోలిండియా లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో మైనింగ్ ఇంజినీరింగ్‌లో చేరి భవిష్యత్తులో జనరల్ మేనేజర్ స్థాయి అధికారిగా ఎదగడమే నా లక్ష్యం.

- కుర్మ అక్షయ

పీహెచ్‌డీలో ప్రవేశించడమే లక్ష్యం

మాది హన్మకొండ జిల్లా ఉప్పల్ గ్రామం. ఈసెట్ ఫలితాల్లో మూడో ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు అరుణ-చంద్రమోహన్. కళాశాల అధ్యాపక బృందం ప్రోద్బలంతోనే ఈ ర్యాంకు సాధించాను. లెక్చరర్ల సహకారం, సలహాలు, పాఠ్యపరమైన శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగ పడ్డాయి. గేట్ రాయడం ద్వారా ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్‌లో మెరిట్ సీటు సాధించి పీహెచ్‌డీలో ప్రవేశించడమే నా లక్ష్యం. ఎన్‌టీపీసీవంటి ప్రభుత్వ రంగ సంస్థలో మైనింగ్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధిస్తా.

-పిప్పాల వర్షిత్

కోలిండియాలో ఉద్యోగం చేస్తా..

మాది పెద్దపల్లి పట్టణం. ఈ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించినందుకు ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రులు శారద, జనార్దన్, లెక్చరర్ల సహకారంతోనే ర్యాంకు సాధించాను. నా తండ్రి కారు డ్రైవరుగా పని చేస్తూ నన్ను చదివిస్తున్నాడు. ఈ ర్యాంకు సాధించినందుకు నా తండ్రి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కింది అనుకుంటున్నా. పట్టుదలతో ముందుకెళ్తే ఎవరైనా ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారు. కోలిండియా లిమిటెడ్‌లో మైనింగ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేయడమే నా లక్ష్యం.

-నడ్లకొండ మారుతి సాయి

దళారులతో 'హస్తం' దోస్తీ!

సుబ్బరాంపల్లి కొనుగోలు కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల అక్రమాలపై రైతుల ఆగ్రహం

- ఇతర ప్రాంతాల నుంచి వడ్లు తీసుకొచ్చి ఇక్కడి రైతుల పేరిట అమ్ముతున్నారని ఆరోపణ
- అక్కడ క్వింటాలుకు రూ. 1800 చొప్పున కొని.. ఇక్కడ రూ. 2300 చొప్పున విక్రయిస్తున్నారని ఫైర్
- శనివారం రాత్రి లోడ్ చేస్తున్న ఓ లారీని అడ్డుకున్న వైనం
- పోలీస్ స్టేషన్‌కు తరలింపు

శనివారం రాత్రి పోలీస్ స్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న రైతులు, యువకులు

చెన్నూర్ రూరల్, మే 25 : 'హస్తం' నేతలు దళారులతో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రతో పాటు కోటపల్లి తదితర ప్రాంతాల్లో క్వింటాలుకు రూ. 1800 చొప్పున కొనుగోలు చేసి.. కత్తెరశాల గ్రామపంచాయతీలోని సుబ్బరాంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ఇక్కడి రైతుల పేరిట రూ. 2300 చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడుతున్నారు. శనివారం రాత్రి ఇక్కడి కొనుగోలు కేంద్రంలో జరిగిన ఘటనే ఇందుకు బలం చేకూరుస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని ఇక్కడి రైతుల పేరిట కొనుగోలు చేసి లారీలో లోడ్ చేస్తుండగా, రైతులు అడ్డుకున్నారు. పోలీసులు, వ్యవసాయ శాఖకు సమాచారం అందించడంతో సీఐ దేవేందర్ అక్కడికి చేరుకొని లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు సుబ్బరాంపల్లిలో తనకున్న భూమిలో పండించిన వడ్లతో పాటు కోటపల్లి మండలం జనగామ గ్రామం నుంచి బొలెరోలో తీసుకొచ్చిన ధాన్యాన్ని ఇక్కడి సెంటర్‌లో అమ్ముతుండగా, సెంటర్ నిర్వాహకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు తీసుకొచ్చిన ధాన్యాన్ని లారీలోకి ఎక్కిస్తుండగా, పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇక్కడి రైతుల పేరిటే వడ్లు కొనుగోలు చేసినట్లు తెలపడంతో దానిని వదిలిపెట్టారు. దళారులకు కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండడంతో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వారం క్రితం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడి రైస్ మిల్లు వద్ద బొలెరో నుంచి లారీలో బస్తాలు అక్రమంగా లోడ్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చినట్లు తెలిసిందే. కాగా, కాంగ్రెస్ నాయకులు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా క్షమించేది లేదని చెప్పిన చెన్నూర్ ఎమ్మెల్యే.. మరి ఇక్కడ జరుగుతున్న ఘటనలపై ఎలా స్పందిస్తారో చూడాలని ప్రజలు అంటున్నారు.

ప్రశాంతంగా గ్రామ పాలనాధికారుల పరీక్ష

నస్పూర్, మే 25 : జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగిందని, 155 మంది అభ్యర్థులకుగాను 132 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

నకిలీ విత్తన ప్యాకెట్లు స్వాధీనం

బేల, మే 25 : అమాయక ఆదివాసీ రైతులను ప్రజలను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు చేయగా.. ఒకరి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని సిర్సన్నలో అమాయక ఆదివాసీ రైతులను ప్రజలను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. ఇందులో సిర్సన్న గ్రామానికి చెందిన ఎండీ కుర్షిద్ వద్ద ఐదు కిలోల లూజ్ నకిలీ విత్తనాలు, 23 నకిలీ విత్తన ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. అతడిని విచారించగా.. తన బావ మహారాష్ట్రలోని మహమూద్ వద్ద 10 కిలోల లూజు నకిలీ విత్తనాలు, 26 ప్యాకెట్లను కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. బాది గ్రామంలో జలపతికి ఐదు కిలోల విత్తనాలను రూ.13 వేలకు.. జుగ్గుకే శంభుకు మూడు ప్యాకెట్లను రూ.1200లకు విక్రయించినట్లు తెలిపాడు. ఇద్దరిపై బేల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమాచారం ఉన్న టాస్క్‌ఫోర్స్ సీఐ 8712659965 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు నమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన జైనథ్ సీఐ

ఆపద్బాంధవులు

- ఆపత్కాలంలో అండగా నిలుస్తున్న 108 సిబ్బంది
- సకాలంలో సేవలందిస్తూ బాధితులకు భరోసా
- కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు

నేడు అంతర్జాతీయ పైలెట్స్ డే

108.. అంబులెన్స్ సిబ్బంది ఆపత్కాలంలో అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. సకాలంలో స్పందిస్తూ బాధితులను హాస్పిటళ్లకు చేర్చి ప్రాణాలు కాపాడుతున్నది. ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొని సేవలందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నది. నేడు 108 పైలెట్స్ డే సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..

- కోటపల్లి, మే 25

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 108 వాహనాల్లో మొత్తం 176 మంది పైలెట్లు విధులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 108 వాహనాలు 18 ఉండగా, 45 మంది, ఆదిలాబాద్ జిల్లాలో 108 వాహనాలు 25 ఉండగా, 60 మంది, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 108 అంబులెన్స్‌లు 15 ఉండగా, 36 మంది, నిర్మల్ జిల్లాలో '108'లు 16 ఉండగా, 36 మంది విధులు నిర్వహిస్తున్నారు. అంబులెన్స్‌లను సమర్థవంతంగా నడుపుతూ ఘటనా స్థలానికి క్షణాల్లో చేరుకొని బాధితులను హాస్పిటళ్లకు చేర్చడంలో పైలెట్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. 108 అంబులెన్స్‌కు ఒక కన్ను ఈఎంటీ అయితే, మరో కన్ను పైలెట్. వీరి సేవలను ఎంత కొనియాడినా తక్కువే. విమానాలు నడిపేవారిని పైలట్ అని పిలుస్తుండగా, అంబులెన్స్ డ్రైవర్లను సైతం పైలెట్‌గా పిలుస్తూ సముచిత గౌరవం కల్పిస్తున్నాం. ఘటనా స్థలం నుంచి హాస్పిటల్‌కు తీసుకెళ్లే సమయాన్ని గోల్డెన్ అవర్‌గా భావిస్తారు. ఎందుకుంటే ఈ సమయం చాలా విలువైనది. ఈ సమయంలో పైలెట్ అప్రమత్తంగా లేకపోయినా.. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. భారీ మూల్యం తప్పదు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ నిత్యం వందలాది మంది బాధితులకు భరోసానిస్తూ ప్రత్యక్ష దైవాలుగా నిలుస్తున్నారు 108 పైలెట్లు.

కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి..

ప్రమాదమని తెలిసినా కొవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి 108 సిబ్బంది సేవలందించారు. కొవిడ్ రోగులు, అనుమానితులను హాస్పిటళ్లకు చేర్చడం.. ఐసొలేషన్ సెంటర్లకు తీసుకురావడం వీరి పాత్ర మరవలేనిది. కొవిడ్ పేషెంట్‌లను తీసుకొని హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లినప్పుడు పైలెట్‌తో పాటు ఈఎంటీ ఒక రోజంతా కుటుంబానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో పైలెట్‌లలో 60 శాతం మందికి కొవిడ్ సోకినప్పటికీ.. తిరిగి కోలుకొని సేవలందించి ప్రశంసలు అందుకున్నారు.

బాధితులను 108 అంబులెన్స్ వద్దకు తీసుకెళ్తున్న పైలెట్

కేసీఆర్ హయాంలోనే సిర్పూర్ అభివృద్ధి

కాంగ్రెస్ పాలనలో వడ్లు కొనే నాథుడు లేక రైతులు అవస్థలు పడుతున్నారు

- ఆ పార్టీతో నాకెలాంటి సంబంధం లేదు
- ప్రగతి సాధ్యమనుకుంటే ఏ పార్టీ జెండా అయినా నాకు ఓకే
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- ఆత్మీయ సమ్మేళనం పేరుతో కాంగ్రెస్‌పై మరోసారి తిగుబాటు
- ఏడాదిన్నరలో 'హస్తం' చేసింది శూన్యమని విమర్శ

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కోనేరు కోనప్ప

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ చింతలమానెపల్లి, మే 25 : కేసీఆర్ పదేళ్ల పాలనలో సిర్పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, రైతులకు ఎంతో మేలు జరిగిందని, అటవీ అధికారుల వేధింపులు ఉండేవి కావని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్ పేట్ మండలాల్లోని తన అనుచరులతో కలిసి బీఎస్పీ నేత ప్రసన్న హరికృష్ణతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతోనే సిర్పూర్ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించానన్నారు. కాంగ్రెస్ పాలనలో ధాన్యాన్ని కొనే నాథుడు లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు పోడు పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటవీ అధికారుల వేధింపులు రైతులపై ఎక్కువయ్యాయని, దిందా గ్రామంలో రైతులు సాగుచేసుకుంటున్న 300 ఎకరాలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పుకొచ్చారు. పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్‌లో అటవీ అధికారుల వేధింపులు తాళలేక లచ్చన్న అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుబడి పోతుందన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇంత వరకు ఏ ఒక్క కార్యక్రమంలో పాల్గొనలేదని, ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నానని, తనకు కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధంలేదని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి జరిగింది, అనేక పథకాలతో రైతులకు మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, గంగాపూర్, పాపన్‌పేట్, కోర్సిని గ్రామాల్లో తాగునీటి కోసం బోర్లు కూడా వేయనివ్వడం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లతో ఎలాంటి విబేధాలు లేవన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏ పార్టీ జెండానైనా పట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కమీషన్ల కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. మారుమూల గ్రామాల్లో అభివృద్ధి కోసం కృషి చేయకుండా కేలం కమీషన్ల కోసమే ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. సుమారు ఐదు నెలల క్రితం కౌటాల మండలం వీర్థండిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్‌పై తిరుగబడ్డారు. కేసీఆర్ పాలనతో ప్రాణహితపై రూ. 75 కోట్లతో మంజూరైన వంతెన నిర్మాణాన్ని ఎందుకు రద్దు చేశారో ప్రజలు ప్రశ్నించాలన్నారు. కాగా, ఆనాడు కోనేరు కోనప్పచేసిన ఆరోపణలపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను హైదరాబాద్‌కు పిలిపించి సమదాయించారు. కోనేరు కోనప్ప కోరుకున్న విధంగా అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హామీలు నెరవేరుస్తారని ఇంతకాలం ఎదురుచూసిన కోనేరు కోనప్ప మరోసారి తిరుగుబాటపట్టారు. మళ్లీ బీఆర్ఎస్‌లో చేరుతారా అని విలేకరులు అడుగగా రాజకీయాల్లో ఏదైనా జరుగవచ్చని, నియోజకవర్గ అభివృద్ధి కోసం తను ఏ పార్టీ జెండానైనా పట్టుకుంటానని బదులిచ్చారు.

హాజరైన ప్రజలు